క్లుప్తంగా

నేడు కాణిపాకంలో ఉచిత వైద్య శిబిరం

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆస్థాన మండపంలో శనివారం బెంగళూరులోని కావేరి ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఈ వైద్య శిబిరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నట్లు భక్తులు, ఆలయ సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

1386 సంఘాలకు వైఎస్సార్ సున్నా వడ్డీ

బంగారుపాళెం: మండలంలో 1,386 స్వయం సహాయక సంఘాలకు వైఎస్సార్ సున్నా వడ్డీ లబ్ధి చేకూరినట్లు వెలుగు ఏపీఎం మీరాబాయి శుక్రవారం తెలిపారు. 2022–23 సంవత్సరానికి గాను మండలంలోని 1386 స్వయం సహాయక సంఘాల్లోని 17,997 మంది సభ్యులకు కోటి 99 లక్షల రూపాయలు సున్నా వడ్డీ లబ్ధి చేకూరిందన్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు వివరించారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: గ్రామీణ ప్రాంత ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో అందిస్తున్న మెరుగైన వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ కోరారు. మండలంలోని దివిటివారిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ 80 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇంటివద్దే ఉచిత వైద్యం



గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు పైసా ఖర్చులేకుండా, సమయం వృథా కాకుండా ఇంటి వద్దే వైద్యసేవలు అందుతున్నాయని బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ అనూష అన్నారు. మండలంలోని చీలాపల్లెలో శుక్రవారం డాక్టర్ అనూష ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 65 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో మంచంపైన ఉన్న రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఉమామహేశ్వరి, శిరీష, మల్లిక, సుప్రియలు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూ రీసర్వే

తవణంపల్లె: భూరీసర్వేను సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి ఆదేశించారు. మండలంలోని దిగువ మోదలపల్లెలో భూ రీసర్వే పూర్తయి సరిహద్దు రాళ్లు నాటే కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో భూ రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ, వీఆర్‌ఓ రాజశేఖర్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబితా

చిత్తూరు కలెక్టరేట్ : ఓటరు జాబితా పక్కాగా ఉండాలని, అందులో ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో వరుస సమావేశాలను నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఇంటింటి సర్వే ఈ నెల 21లోగా ఇంటింటా సర్వే వంద శాతం పూర్తి చేయాలని చెప్పారు. ఇంటింటా సర్వేకి బీఎల్‌వోలతోపాటుగా బిఎల్‌ఏలు మాత్రమే వెళ్లాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో రాజశేఖర్, ఆర్డీవోలు రేణుక, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో దాడి : వ్యక్తి మృతి

పూతలపట్టు : మద్యం మత్తులో దాడి చేయగా ఓ వ్యక్తి మృతితి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సురేష్‌నాయుడు బావమరిది గంగయ్యానాయుడు (70)పై మద్యం మత్తులో దాడికి పాల్పడినట్లు తెలిసింది. ఈ దాడిలో అపస్మారకస్థితిలోకి వెళ్లిన గంగయ్యానాయుడు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

సారా పట్టివేత

చిత్తూరు అర్బన్: తవణంపల్లె మండలంలో శుక్రవారం ఎస్‌ఈబీ అధికారులు నాటుసారా, కర్ణాటక మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పుత్రమద్ది గ్రామ సమీపంలో జయబ్బ (54) వద్ద 4 లీటర్ల నాటుసారా పట్టుబడింది. విక్రేతను అరెస్ట్ చూపించి రిమాండ్‌కు తరలించారు.

అభివృద్ధి పనులు వేగవంతం

- అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- ప్రజా సమస్యలకు ప్రాధాన్యం
- చిత్తూరు, పలమనేరు నియోజకవర్గాల సమీక్షలో ఇన్‌చార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చిత్తూరు, పలమనేరు నియోజకవర్గాల సమీక్ష నిర్వహించారు. ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ, అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందజేస్తోందన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఉన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఈ దిశగా క్షేత్రస్థాయిలో అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ఇల్లు మంజూరైనా ఇంతవరకూ నిర్మాణాలకు పూనుకోని లబ్ధిదారులకు అవగాహన కల్పించి, పనులు చేపట్టేలా ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకపోతే ఇంటి పట్టాను రద్దు చేసి, అర్హులైన మరొకరికి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిత్తూరు, పలమనేరు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, వెంకటేగౌడ తమ నియోజకవర్గాల్లో చేస్తున్న అభివృద్ధి పనులపై మాట్లాడారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ, నియోజకవర్గాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గాల వారీగా సంక్షేమ, అభివృద్ధి పథకాల పురోగతిని ఆయన వివరించారు.

పైపులైన్ పనులకు ప్రతిపాదనలు

నెల్లూరు జిల్లా కండలేరు నుంచి చామంతిపురం రిజర్వాయర్‌కు 5టీఎంసీల నీటిని పైపులైన్‌తో తరలించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. తద్వారా చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి అవకాశం ఉంటుందన్నారు. పలమనేరు నియోజకవర్గంలో కైగల్, గంగమ్మ శిరస్సు, గంగమ్మ ఏరు రిజర్వాయర్లకు సంబంధించి ఇదివరకే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. చిత్తూరు నియోజకవర్గంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు, కట్టమంచి 'వై' జంక్షన్ రోడ్డు, చిత్తూరు–పుత్తూరు రోడ్డు, చిత్తూరు, గుడిపాలలో కొత్త శ్మశాన వాటికల ఏర్పాటుకు భూ సేకరణ, ఇతర సమస్యల పరిష్కారంపై చర్చించారు. పలమనేరు రూరల్ మండలంలో సంబరపూర్ రోడ్డుకు అటవీశాఖ అనుమతులు, వి.కోట సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రిగా మార్చు చేయాలని చర్చించారు. సమీక్ష లో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, నగర మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి, నగరపాలక డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అమ్మవారి సేవలో మంత్రి పెద్దిరెడ్డి

అమ్మవారి సేవలో మంత్రి

చిత్తూరు రూరల్ : అమరవీరుల స్తూపం, నియోజకవర్గాల అభివృద్ధి సమీక్షా సమావేశానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం చిత్తూరుకు వచ్చారు. తొలుత స్థానిక దొడ్డిపల్లెలోని సప్తకనికలమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు శివకుమార్, కార్పొరేటర్ సునీత ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. మంత్రితోపాటు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబు, వెంకటేగౌడ, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, పాల ఏకరి చైర్మన్ కుమార్‌రాజా, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, టౌన్ బ్యాంకు చైర్మన్ రాంగణేష్, కార్పొరేటర్లు భాగ్యలక్ష్మి, హరిణిరెడ్డి, మధురెడ్డి, సహదేవ్ నాయకులు కృష్ణమూర్తి, భూపేష్‌గోపినాథ్, శేఖర్, నారాయణ పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం

చిత్తూరు రూరల్: చిత్తూరు నియోజకవర్గంలో మూడు రోజులుగా ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. సుర్రుమంటున్న సూర్యుడితో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఎండ తీవ్రత, భరించలేని ఉక్కపోతతో అల్లాడిపోయారు. అయితే శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో వాతావరణం కాస్త చల్లబడింది. రోడ్లంతా జలమయంగా మారాయి. ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం లభించింది.

రెండు నామినేషన్ల తిరస్కరణ

గుడిపాల: మండలంలోని పానాటూరు పంచాయతీలోని 5వ వార్డుకు సంబంధించి రెండు నామినేషన్లను తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాధవి తెలిపారు. శుక్రవారం ఉదయం ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ల స్క్రూటినీ నిర్వహించారు. ఇందులో అలైక్యకు సంబంధించి 5వ వార్డులో ఉన్న వ్యక్తి ప్రతిపాదించకుండా వేరే వార్డులో ఉన్న వ్యక్తి ప్రతిపాదించడంతో తిరస్కరించగా, సువితకు సంబంధించి ఎన్నికల ఓటర్ జాబితాలో పేరు లేకపోవడంతో ఆమె నామినేషన్‌ను తిరస్కరించినట్లు మాధవి తెలియజేశారు.

రేపు కంటి వైద్య శిబిరం

బంగారుపాళెం: మండల కేంద్రంలోని స్థానిక ఎన్‌పీసీ నాయుడు పార్కులో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు వెంకటేశ్వరచౌదరి తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కంటి వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తారన్నారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం







ఐరాల: ర్యాలీ చేస్తున్న అధికారులు, నాయికులు, పూతలపట్టు: ర్యాలీ చేస్తున్న అధికారులు, తవణంపల్లె: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ రంజిత్‌రెడ్డి

ఐరాల/బంగారుపాళెం/తవణంపల్లె/పూతలపట్టు: స్వాతంత్ర్య సాధన కోసం సమరయోధులు చేసిన త్యాగాలను స్మరించుకుందామని ఐరాల ఎంపీడీఓ నాగరాజు పిలుపునిచ్చారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం నియోజకవర్గంలో నా భూమి- నా దేశం కార్యక్రమం నిర్వహించారు. నేలతల్లికి నమస్కారం–వీరులకు వందనం సమర్పిస్తూ ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేయించి మొక్కలు నాటారు. ఐదుగురు విశ్రాంత సైనికులను ఘనంగా సన్మానించారు. అనంతరం ర్యాలీలు నిర్వహించారు. ఐరాల మండలంలో వైఎస్సార్‌సీపీ నేతలు ప్రభాకర్‌రెడ్డి, మునస్వామిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, హెచ్‌ఎం అరుణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. బంగారుపాళెం మండలంలో బోడబండ్ల, ముంగరమడుగు, జిల్లేడుపల్లె, గుంతూరు, జంబువారిపల్లె, బొమ్మాయిపల్లె, తంబుగానిపల్లె, కరిడివారిపల్లె పంచాయతీల్లో ఆయా సర్పంచుల అధ్యక్షతన ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి నిర్వహించారు. తవణంపల్లె మండలం మల్లకుంట, మాధవరం, గోవిందరెడ్డిపల్లె, చెర్లోపల్లె, కారకాంపల్లె, దిగువమాఘం, దిగువ మోదలపల్లె, నలిశెట్టిపల్లె, టి.పుత్తూరు గ్రామాల్లో ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

పూతలపట్టు మండలం కమ్మగుట్టపల్లిలో ఎంపీడీవో గౌరీ ఆధ్వర్యంలో నాదేశం–నాభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు.

● ఏందియా.. బయటకెళ్లు

ఏందియా...నీకే కదా చెబుతా ఉండాది. నిన్ను లోపలికి పంపించేది లేదు..ఎవరికి చెబుతావో.. చెప్పుకో..బయటకుపో ముందు అంటూ ఓ సెక్యూరిటీ గార్డు రోగిపై చిందులేశాడు. ఓ వ్యక్తి చికిత్స నిమిత్తం శుక్రవారం ఉదయం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. చికిత్స చేసిన వైద్యులు అతన్ని ఆసత్రిలో చేరాలని సూచించారు. దీంతో రోగి అడ్మిట్ ఫైల్ తీసుకుని ఎం.ఎస్ వార్డు గేటు వద్దకు వెళ్లాడు. అయితే రోగిని మాత్రమే లోపలికి అనుమతిస్తామని, అతనికి సాయంగా వచ్చిన వ్యక్తి లోపలకు పంపేది లేదని అడ్డుకున్నాడు. దీంతో రోగి తానొక్కడే వెళితే.. తోడెవ్వరని ప్రశ్నించాడు. దీంతో రెచ్చిపోయిన సెక్యూరిటీ చిందులుతొక్కాడు. వెళ్లిపోండి అంటూ ఇద్దరినీ గేటు బయటే 15 నిమిషాల పాటు నిలబెట్టి దురుసుగా ప్రవర్తించాడు. ఆపై మరో సెక్యూరిటీ గార్డు జోక్యం చేసుకుని నచ్చచెప్పి లోపలికి పంపేశాడు. ఇలాంటి ఘటనలు అత్యవసర విభాగం, ప్రసూతి విభాగం, ఎం.ఎస్ వార్డు గేటు ఎదుట తరచూ చోటుచేసుకుంటున్నాయి. వీరి దౌర్జన్యాలతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. అయినా ఉన్నతాధికారులు మాత్రం చోద్యం చూస్తూ కూర్చోవడం శోచనీయం.



– చిత్తూరు రూరల్

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

గుడిపాల: డ్వాక్రా మహిళా సంఘాలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలకు సంబంధించి శుక్రవారం సున్నావడ్డీ పథకం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి ఖాతాల్లో నగదు జమచేశారు. ఇందులో భాగంగా శుక్రవారం ఇందిరా క్రాంతి భవనంలో మహిళలు సున్నావడ్డీ పథకానికి సంబంధించి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. అనంతరం ముఖ్యమంత్రి చిప్రటానికి పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ నాలుగు విడతల్లో బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను మహిళా సంఘాలకు తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

ఏపీఎం సుధారాణి మాట్లాడుతూ గుడిపాలలో సున్నావడ్డీ ద్వారా 680 సంఘాలకు సంబంధించి 8305 మంది సభ్యులకు రూ.90 లక్షలు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు లోకనాథరెడ్డి, హేమచంద్రారెడ్డి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఐరాల ఉన్నత పాఠశాల పీఎంశ్రీకి ఎంపిక



హెచ్‌ఎం కోమల

ఐరాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి ఎంపికైందని హెచ్‌ఎం కోమల శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరం నుంచి 2027–28 వరకు(ఐదేళ్లు) కేంద్ర ప్రభుత్వ నిధులతో విద్యార్థులకు ఆధునిక వసతులు, అత్యాధునిక సదుపాయం, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ(ఐసీటీ), డిజిటల్ గ్రంథాలయం, క్రీడలకు ప్రోత్సాహం, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ, వృత్తివిద్యా కోర్సులు, నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుపుతున్న ఈ పాఠశాలలో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా చొరవ చూపాలని కోరారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

వేడుకగా ద్రౌపదమ్మ తిరునాళ్లు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం గ్రామంలో శుక్రవారం సాయంత్రం ద్రౌపదమ్మ తిరునాళ్ల వేడుకగా నిర్వహించారు. పంచాయతీలోని వినాయక పురంలో వెలసిన ద్రౌపది ధర్మరాజుల ఆలయం నుంచి ద్రౌపది, పాండవుల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి కాణిపాకంలో కొలువుదీర్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి కర్పూర మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు స్థానిక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, రవిరెడ్డి, నాగరాజు, సుధీర్ పాల్గొన్నారు.

ముట్టుకూరులో మహాభరత యజ్ఞం

తవణంపల్లె: మండలంలోని ముట్టుకూరులో శుక్రవారం మహాభారత యజ్ఞం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో ద్రౌపదీదేవి, ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవుల విగ్రహాలకు అభిషేకం పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఉభయదారులచే సకల దేవతలకు పిలుపునిస్తూ ధ్వజారోహణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తర్వాత కలశస్థాపన, గణపతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 11వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నాగరత్నం భాగవతార్‌చే హరికథాగానాలాపం చేస్తారని వివరించారు. 17వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఓం ఉమామహేశ్వరి నాట్య కళామండలిచే రాత్రి తమిళంలో రాత్రి నాటక ప్రదర్శన చేస్తారని పేర్కొన్నారు. భక్తులు విశేషంగా విచ్చేసి మహాభారత యజ్ఞం విజయవంతం చేయాలని కోరారు.



ముట్టుకూరులో హరికథగానాలాపన చేస్తున్న భాగవతార్ నాగరత్నం



కాణిపాకంలో ద్రౌపది, పాండవుల విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

ఉపాధ్యాయుడికి పూర్వ విద్యార్థుల విరాళం



మల్లికార్జున్‌కు విరాళం అందజేస్తున్న విద్యార్థులు

గుడిపాల: అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయుడికి పూర్వ విద్యార్థులు విరాళం అందజేశారు. నరహరిపేట జెడ్పీ హైస్కూల్లో (2003–04) పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు తమ గురువు మల్లికార్జున్ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారమందుకున్నారు. వెంటనే అందరూ కలిసి మల్లికార్జున్‌కు శుక్రవారం రూ.26వేలను విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు దొరస్వామినాయుడు చేతుల మీదుగా ఆయనకు అందజేశారు. ఇంకా అవసరమైతే తమవంతు సహాయం చేస్తామని వారు తెలియజేశారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

గుడిపాల: మండలంలోని పానాటూరు ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు వెంకటేష్, మనోహర్‌నాయుడు, ఈశ్వరి, రాజ్యలక్ష్మి, శివప్రకాష్‌ను సహచరులతోపాటు సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ మొగిలిరెడ్డి ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఎంఈఓ గణపతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి వారందరికీ శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు 100 భోజనం ప్లేట్లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, అమరనాథరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



కాణిపాకంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రాంగణంలో తిరుపతిలోని డాక్టర్ కేర్ హోమియోపతి ఆస్పత్రి వారిచే ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం ఉదయం స్వామివారి ఆస్థాన మండపంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దీన్ని ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు ప్రారంభించారు. హోమియోపతి వైద్యులు ఆలయ చైర్మన్, ఈఓ, సిబ్బందికి, తదితర భక్తులకు చికిత్సలు నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు ఉచితంగా భక్తులకు, ఆలయ సిబ్బందికి చికిత్సలు చేయడం చాలా సంతోషకరమన్నారు. ఆస్పత్రి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ రంగస్వామి, హోమియోపతి వైద్యులు అనిల్‌కుమార్, హైమాగని తదితరులు పాల్గొన్నారు.